రబీకి సాగునీరు లేనట్టే!

- చేతులెత్తేసిన అధికారులు
- అపరాల సాగు వైపు రైతుల చూపు

ఏలూరు రూరల్ : ఏలూరు అర్బన్, రూరల్ మండల గ్రామాల్లో రబీ సాగుపై రైతులు ఆశలు నీరుగారిపోయాయి. సాగునీరు ఇవ్వలేమని ఇరిగేషన్ అధికారులు చేతులెత్తేశారు. అపరాలు సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో ఆశించిన దిగుబడి రాకపోవడంతో రబీపై ఆశలు పెంచుకున్న రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది పుష్కలంగా వర్షాలు కురిసినప్పటికీ ప్రభుత్వం రబీకు సాగునీరు ఇవ్వకపోడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఒకపక్క సాగునీరు ఇవ్వలేమని ఇరిగేషన్ అధికారులు వెల్లడిస్తే.. స్థానిక ఎమ్మెల్యే ద్వారా అసరమైనప్పుడు నీరు విడుదల చేయిస్తామంటూ అధికార పార్టీ నేతలు రైతులను నమ్మబలుకుతున్నారు. కృష్ణా బేసిన్‌లో సరిపడా నీటి నిల్వలు లేవంటూ అధికారులు చెబుతుంటే, నీరు ఇప్పిస్తాంటూ అధికార పార్టీ నాయకులు చెప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాయకులను నమ్మి రబీ సాగు చేస్తే తమ పరిస్థితి ఏంటని రైతులు వాపోతున్నారు.

6 నెలలైనా అందని సాయం

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ అన్నదాత సుఖీభవ పథకం అమలు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకంపై ఆశ పెట్టుకుని ఖరీఫ్ సాగు చేసి అప్పులపాలయ్యామని రైతులు వాపోతున్నారు. తుఫాన్లు కారణంగా ఖరీఫ్‌లో ఆశించిన దిగుబడి సాధించలేకపోయామని, ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఉంటే నష్టపోయే అవకాశం ఉండేదని కాదని ఆవేదన చెందుతున్నారు. కనీసం రబీ సమయంలోనైనా అన్నదాత సుఖీభవను అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.



వెంకటాపురంలో అపరాలు సాగు చేస్తున్న దృశ్యం



ఏలూరు పడమట లాకుల వద్ద అట్టడుగుకు చేరిన నీటి మట్టం



నీరు లేక తూడుతో నిండిన కృష్ణా కెనాల్

అపరాల సాగుపైనా ఆందోళన

అపరాల సాగుకు సైతం కొందరు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అందించే అపరాలు విత్తనాలతో ఆశించిన దిగుబడి రావడం లేదని చెబుతున్నారు. ఎకరానికి కనీసం 20 కేజీల పెసలు చల్లాలి. ఇందుకోసం రూ.2 వేలు ఖర్చవుతుంది. దీనికి తోడు మరో రూ.వెయ్యి వెచ్చించి పురుగు మందులు వినియోగించాలి. ఎకరానికి కనీసం నాలుగు క్వింటాళ్ల దిగుబడి సాధిస్తే తప్ప రైతుకు లాభం ఉండదు. అపరాల సాగు సమయంలో వ్యాపారులు విత్తనాలు రేటు పెంచేసి, పంట చేతికొచ్చాక రేటు తగ్గిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

నీరు ఇవ్వలేమని చెప్పాం



కృష్ణా బేసిన్‌లో సరిపడా నీరు లేదు. రబీకు నీరు ఇవ్వలేమని రైతులకు చెప్పాం. ఏలూరు అర్బన్, రూరల్ ప్రాంతాలు శివారున ఉండడంతో, సాగు నీరు అందించాలంటే ఎగువ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున నీరు విడుదల కావాలి. ఏలూరు పడమట లాకుల వద్ద కెనాల్‌లో నీరు కనీసం 100 మార్కింగ్ గేజ్ చూపాలి. చాటపర్రు, మాదేపల్లి తదితర ప్రాంతాల్లో 50 గేజింగ్ చూపాలి. అప్పుడు సరిపడా నీరు అందుతుంది. కాని, కృష్ణా కెనాల్ వద్ద 10 గేజింగ్ కూడా లేదు.

– సీహెచ్ దుర్గారావు, కేఈ కెనాల్, ఏఈ

పంట ధరపై దృష్టి పెట్టాలి



రబీకు నీరు లేదని అపరాలు సాగు చేస్తున్నాను. ఇప్పటికే ఎకరానికి రూ.2 వేలు ఖర్చు చేసి పెసలు చల్లాను. తెగుళ్లు లేకపోతే ఎకరానికి కనీసం 4 క్వింటాలు దిగుబడి రావాలి. సాగు సమయంలో అపరాల రేట్లు ఎక్కువగా ఉంటున్నాయి. పంట చేతికొచ్చినప్పుడు రేటు పడిపోతుంది. అధికారులు దీనిపై దృష్టి పెడితే అపరాల సాగు కూడా లాభం ఇస్తుంది.

– పాలం గణేష్, రైతు వెంకటాపురం

కలెక్టర్ రాక కోసం నిరీక్షణ



కలెక్టర్ రాక ఆలస్యం కావడంతో మీటింగ్ హాలులో నిద్రపోతూ..



ఎప్పటికి వస్తుందో ఆ అమ్మ



కలెక్టర్ కోసం విభిన్న ప్రతిభావంతుల నిరీక్షణ

లూయిస్ బ్రెయిలీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లోని గోదావరి మీటింగ్ హాలులో ఏర్పాటు చేసిన విభిన్న ప్రతిభావంతుల సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆలస్యంగా రావడంతో అంధులు నిరీక్షించాల్సి వచ్చింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు రావాల్సిన కలెక్టర్ 11.52 గంటలకు వచ్చారు. కలెక్టర్ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు ఇళ్లకు వెళతామో అంటూ అంధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇలాంటి కార్యక్రమానికి ఆలస్యంగా రావడం తగునా కలెక్టరమ్మా అంటూ అక్కడున్న వారు ఆవేదన వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు

క్లుప్తంగా

కారుణ్య నియామక ఉత్తర్వు అందజేత



నియామక ఉత్వర్వు అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ మరణించిన కంది వెంకటేశ్వరరావు కుమారుడు ఉమా సాయికుమార్‌కు మంగళవారం సాయంత్రం మేయర్ చాంబర్‌లో కారుణ్య నియామక ఉత్తర్వును నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, కమిషనర్ ఎ.భాను ప్రతాప్ అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, మున్సిపల్ ఇంజినీర్ సురేంద్రబాబు, సూపరింటెండెంట్ ఎండీ సిరాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

జిల్లా అధికారులకు శుభాకాంక్షలు



జేసీకి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

ఏలూరు(మెట్రో): సివిల్ సప్లయిని సక్రమంగా నిర్వహించేందుకు డీలర్లంతా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి సూచించారు. ఏలూరు జిల్లా డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం ఏలూరు జిల్లా అధికారులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. జేసీ ధాత్రి రెడ్డి, డీఎస్ఓ సత్యనారాయణ రాజు, డీఎంవీ శ్రీలక్ష్మి, ఏఎస్ఓ ప్రతాప్‌రెడ్డిలను వారు కలిసి అభినందనలు తెలిపారు. వీరిలో జిల్లా ముఖ్య కార్యదర్శి అత్తలూరి ఉదయశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొలుసు లక్ష్మణరావు, కోశాధికారి కె.నాగరాజు, జాయింట్ సెక్రెటరీ బి.కోటేశ్వరరావు, గిరి, నూజివీడు ఏసు, మహిళా అధ్యక్షరాలు పిల్లా రాజరాజేశ్వరి, హరికృష్ణ, బాషా తదితరులు ఉన్నారు.

బిషప్ ఆంథోనికి ఘన స్వాగతం



బిషప్ ఆంథోనిను స్వాగతిస్తున్న జయరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వాటికన్ సిటీ రాయబారిగా పలు దేశాల్లో సేవలందించి, ప్రస్తుతం మద్రాస్ మైలాపూర్ ఆర్చ్ బిషప్‌గా కొనసాగుతున్న బిషప్ జార్జ్ ఆంథోని స్వామి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏలూరులో మంగళవారం పర్యటించారు. స్థానిక జేవియర్ నగర్‌లోని కథీడ్రల్ చర్చి ఆవరణంలో ఏర్పాటు చేసిన విజ్ఞాన నిలయాన్ని ఆయన సందర్శించారు. ఆయనకు ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజేస్, ఏలూరు కథీడ్రల్ ఆలయం కోశాధికారి ఫాదర్ బి.రాజు, ఫాదర్ చిన్ను, నిర్మలగిరి అన్నదానం ట్రస్ట్ చైర్మన్ కళ్లే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

48 మందికి ఉద్యోగాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డీఎల్‌టీసీ / ఐటీఐ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 92 మంది యువత హాజరుకాగా, వీరిలో 48 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్ జితేంద్ర బాబు, కళాశాల ప్రిన్సిపాల్ ఉగాది రవి తెలిపారు. ఈ మేళాలో ఫ్లిప్‌కార్ట్, మీషో, రిలయన్స్, శౌర్య బిజినెస్ సొల్యూషన్స్ కంపెనీల ప్రతినిధులు ఎంపిక ప్రక్రియ నిర్వహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్, ఈఓపీ జి.వరలక్ష్మి, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది వి.కిషోర్, కె.రాంబాబు, సునీల్ కుమార్, రాజేశ్వరి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సమాఖ్య సభ్యులు



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న జిల్లా సమాఖ్య సభ్యులు

ఏలూరు(మెట్రో): జిల్లా సమాఖ్య, ఏలూరు జిల్లా పాలకవర్గ నూతన సభ్యులు మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ కె.వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసే ఉత్పత్తులు ఈ కామర్స్ (ఓఎన్‌డీసీ) ద్వారా మార్కెటింగ్ జరిగేలా చూడాలని, ఉల్లాస్ కార్యక్రమంలో పాల్గొని వయోజన విద్యకు మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్ విజయరాజు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు పూసం గంగారత్నం, ఉపాధ్యక్షురాలు ఆవుల స్వర్ణ కుమారి, కార్యదర్శి తోట కృపామణి, సహాయ కార్యదర్శి సయ్యద్ సుల్తానా, కోశాధికారి గోళ్ల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా ఎఫ్‌ఓగా శుభమ్

ఏలూరు రూరల్ : ఏలూరు జిల్లా అటవీశాఖ అధికారిగా శుభమ్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన ఏలూరులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన్ని అటవీశాఖ అధికారులు, అసోసియేషన్ సభ్యులు కె.రాంబాబు, బి.ప్రసాద్, వి.ఏసు, పండు, డి.శ్రీను, జి.మారేష్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సీఐటీయూ ఏలూరు నగర కమిటీ ఎన్నిక



వీవీఎన్ ప్రసాద్



వైఎస్ కనకారావు

ఏలూరు (టూటౌన్): కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించే సీఐటీయూ ఏలూరు నగర కమిటీకి నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వీవీఎన్ ప్రసాద్, వైఎస్ కనకారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్‌లు మాట్లాడారు. మున్సిపల్, అంగన్‌వాడీ, ఆశ కార్మికులు సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో ఉన్న ఆటో, ట్రాన్స్‌పోర్ట్, హమాలీ, బిల్డింగ్ కార్మికులు, వివిధ షాపింగ్ మాల్స్‌లో పనిచేసే మహిళలు అందరినీ సంఘటితం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యత – పోరాటం అనే నినాదంతో సీఐటీయూ కార్మిక వర్గాన్ని ఐక్యం చేసేందుకు కృషి చేస్తోందని వారు తెలిపారు. ఏలూరు నగరంలో అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని వలస కార్మికుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. జె.గోపి, జి.రవి కిషోర్, రజిని, పి.హైమావతి, దేవి తదితరులు నూతన అధ్యక్ష కార్యదర్శులకు అభినందనలు తెలిపారు.

అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



జయప్రకాష్‌కు వైఎస్సార్ టీఏ క్యాలెండర్, డైరీ అందించిన నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు పోషించే పాత్ర అత్యంత కీలకమని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ) అన్నారు. మంగళవారం స్థానిక జేపీ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు జేపీని మర్యాద పూర్వకంగా కలిశారు. అసోసియేషన్ క్యాలెండర్, డైరీలను అందజేశారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉపాధ్యాయులను సొంత కుటుంబ సభ్యుల్లా భావించి, వారికి అనేక రకాలుగా అండగా నిలిచారని గుర్తుచేశారు. 20 – 25 సంవత్సరాల క్రితం నాటి డీఎస్సీ అర్హులకు సైతం ఉపాధ్యాయులుగా ఉద్యోగాలిచ్చి సమాజానికి ఉపాధ్యాయుల అవసరం ఎంతుందో తెలిపారని వివరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులను మోసం చేస్తోందని, ఇతర అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకూ జీతాలు త్వరగా చెల్లిస్తున్నా.. ఉపాధ్యాయులకు మాత్రం ఆలస్యం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సందర్భంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు చేసే ప్రతి పోరాటంలోనూ వైఎస్సార్ సీపీ మద్దతుగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. జేపీని కలిసిన వారిలో వైఎస్సార్ టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం సుధీర్, ఏలూరు జిల్లా అధ్యక్షుడు పగడాల సాంబశివరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామ్మోహనరావు, అర్బన్ అధ్యక్షుడు రామారావు అర్బన్ కార్యదర్శి జోసఫ్, రంగబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న పంకజ్ కుమార్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధిపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్టు సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ కె.పంకజ్ కుమార్ అన్నారు. జిల్లాలో ఎంపికైన 40 మంది ఉపాధ్యాయులకు స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 2021వ సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా 30 పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, ప్రస్తుతం నాల్గో దశలో 9వ తరగతి చదువుతున్న సుమారు 4 లక్షల మందికి పైగా విద్యార్థులతో దాదాపు 5 వేల పాఠశాలల్లో అమలు చేస్తున్నట్టు చెప్పారు. దీని ద్వారా పిల్లల్లో అత్యుత్తమమైన వ్యవస్థాపక మనస్తత్వాన్ని, 21వ శతాబ్దపు అనేక నైపుణ్యాలను పెంపొందిచగలుగుతామని వివరించారు. సమస్యను గుర్తించి, పరిష్కారాన్ని కనుగొనడంలో సృజనాత్మకను పెంపొందించడానికి ఇది సహాయ పడుతుందని తెలిపారు. ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు నేర్చుకున్న విషయాలను ప్రదర్శించడంతో పాటు విద్యార్థుల్లో ప్రాథమిక ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించగలుగుతామని అన్నారు. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నామని, వీరిలో జిల్లా నుంచి 40 మందిని ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ ఆర్ రామారావు, రాష్ట్ర ప్రోగ్రాం జోనల్ మేనేజర్ సీహెచ్ బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాను అగ్రస్థానంలో నిలపండి

పదో తరగతి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపిన కలెక్టర్



ఏలూరు(మెట్రో): పదో తరగతి పరీక్షల ఉత్తీర్ణతలో రాష్ట్రంలో ఏలూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు విద్యార్థులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం కలెక్టర్ చాంబర్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని 249 ప్రభుత్వ, జిల్లా పరిషత్ హైస్కూల్లోని పదో తరగతి విద్యార్థులతో మార్చి నెలలో నిర్వహించే పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన అంశాలపై ముచ్చటించి, విద్యార్థుల్లో ఉన్న పరీక్షలంటే భయాన్ని పోగొట్టి, వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 23 వేల మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. టీవీలు, ఫోన్లకు దూరంగా ఉండి టెక్స్ట్ బుక్స్‌తోపాటు విజయకేతనం మెటీరియల్‌ను అభ్యసించి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఇంజనీరింగ్, డాక్టర్, కలెక్టర్ తదితర ఉద్యోగాలకు ముందుమెట్టు పదో తరగతి ఉత్తీర్ణతేనని చెప్పారు. అనంతరం కుక్కునూరు ట్రైబల్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపేందుకు ఆదేశాలిచ్చారు. సమావేశంలో డీఈఓ వెంకట లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మాల భవన్ నిర్మాణం పూర్తికి సహకరించండి



ఎమ్మెల్యే చంటికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న మాల భవన్ పూర్తికి నిధులను అందించి సహకరించాలని మాల సంఘాల ఫెడరేషన్ నాయకులు ఎమ్మెల్యే బడేటి చంటికి వినతి పత్రం అందజేశారు. మాల సంఘాల ఫెడరేషన్ నాయకుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే చంటి ఏలూరు జన్మభూమి పార్క్ వద్ద ఉన్న నిలిచిన మాల భవనం పనులను మంగళవారం పరిశీలించారు. ఈ నిర్మాణం పూర్తికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ నాయకులు చాగంటి సంజీవ్, దాసరి ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, మెండెం సంతోష్ కుమార్, వల్లెంప్రసాద్, పాము సామేలు, మాణిక్యాలరావు, జాలా బాలాజీ, గుడిపూడి రవి, జక్కుల బెనర్జీ, మెండెం ఆనంద్, దాసరి శ్యామ్, ఎం సత్యనారాయణ, ఎస్ కార్తీక్ పాల్గొన్నారు.

10న మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

ఏలూరు (టూటౌన్): గత సమ్మె కాలపు ఒప్పందాల అమలు కోరుతూ ఈ నెల 10న నిర్వహించే మున్సిపల్ కార్మికుల రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో కార్మికులను కోరింది. డిమాండ్ల సాధనకు అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్నట్టు తెలిపింది.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	35
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	43
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	18
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	30
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	33
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

అబ్బురపరచిన కూచిపూడి నృత్యాలు



చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య విన్యాసం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణ, నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వెంపరాల రామలక్ష్మీ శాస్త్రి భక్త రామదాసు సంకీర్తనలు, తెనాలికి చెందిన నోరి నారాయణ మూర్తి శ్రీ వేంకటేశ్వర వైభవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. రాత్రి నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు.

హెచ్ఎంపీవీ వైరస్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో హెచ్ఎంపీవీ వైరస్ పై రెడ్ క్రాస్ వలంటీర్లు స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి ఫైర్‌స్టేషన్ మీదుగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ హెచ్ఎంపీవీ వైరస్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ వైరస్ పై అవగాహన కలిగి ఉండి, మాస్కులు ధరించడం, సామాజిక దూరాన్ని పాటించడం, చేతులు శుభ్ర పరచుకోవడం, జన సందోహాలకు దూరంగా ఉండటం వంటివి చేస్తే సరిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా 400 మందికి మాస్కులు పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ సభ్యుడు ఆర్ఎస్ఆర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరూ సమష్టిగా జాగ్రత్తలు పాటిస్తూ హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి కేబీ సీతారాం, టి.రామారావు, డీఆర్ సీహెచ్ నారాయణ, డాక్టర్ జి.స్పందన, పీఆర్ఓ కేవీ రమణ, రెడ్‌క్రాస్ నర్సింగ్ విద్యార్థినులు, ట్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.